## ఘనంగా బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్,తదితరులు

బండ్లగూడ, జూన్ 19 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుద్వేల్‌లో శ్రీశ్రీశ్రీ మహంకాళి సమేత వీరభద్రస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యా దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిపీఠ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కార్మికులకు కిట్లను అందజేస్తున్న
కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

బండ్లగూడ, జూన్ 19 : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏడో డివిజన్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఉదయం లేచినప్పటి నుంచి తమ విధి నిర్వహణలో అనేక సేవలు అందిస్తారన్నారు.

## విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, జూన్ 10 : శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మంగళవారం పర్యటిస్తారని ఎంపీడీవో వసంతలక్ష్మి తెలిపారు. ఉదయం పది గంటలకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఆర్డీవో చంద్రకళలతో పాటు పలువురు అధికారులు పాల్గొంటారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నూతన కమిటీ ఎన్నిక



మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కాచారం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మైలారం భిక్షపతి,జంగయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మైలారం రవి, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్,అధికారప్రతినిధిగా శ్రీపాల్, కార్యదర్శులుగా శేఖర్, మహేందర్, చెన్నయ్య, రాజు, కార్యవర్గ సభ్యులుగా అనిల్, దినేశ్, శ్రీధర్, జైపాల్, మధులను ఎన్నుకున్నారు. – శంషాబాద్ రూరల్, జూన్ 19

# హరితహారంతో ఆకుపచ్చ తెలంగాణ

- మొక్కలు నాటి సంరక్షించాలి
- హరితోత్సవంలో మొక్కలు నాటిన మేయర్ మహేందర్‌గౌడ్



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్

మణికొండ, బండ్లగూడ, జూన్ 19 : తెలంగాణ రాష్ర్టాన్ని పచ్చదనంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మైనార్టీ పాఠశాలలో మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ప్రజలకు సూచించారు.

**రాజేంద్రనగర్‌లో...**

హరితోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ జగన్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో జరిగే శుభకార్యాల రోజున మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో హరితదినోత్సవం సందర్భంగా నాయకులు, అధికారులు పారిశుధ్య కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..**

శంషాబాద్ రూరల్, జూన్ 19 : తెలంగాణ హరితహారం దేశానికే రోల్‌మోడల్ అని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లిలో హరితహారం కార్యక్రమాన్ని కౌన్సిలర్ పెదిరిపాటి రాణి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్ మాట్లాడుతూ హరిత హారం కార్యక్రమంతో రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలోని సహజసిద్ధమైన అడవులు పూర్తిగా ఆంధ్రపాలనలో ధ్వంసమైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తర్వాత ప్రకృతిని కాపాడాలనే లక్ష్యంతో హరిత హారం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి రక్షిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఖాళీస్థలంలో మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు ప్రభుత్వ స్థలాలు పట్టణ ప్రగతి పేరుతో పట్టణాలలో భారీగా మొక్కలు నాటి వనాలను తయారు చేశామని చెప్పారు. అటవీశాతం పెంచితేనే నీటి వనరులను కాపాడుతాయని ఆలోచించిన సీఎం కేసీఆర్ గ్రామాలు, పట్టణాలు అని తేడా లేకుండా భారీగా మొక్కలు నాటి దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా మారిందన్నారు. కమిషనర్ భోగేశ్వర్లు,మున్సిపల్ అధికారులు ఏఈ నరేశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ అనిల్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**శంషాబాద్‌లో...**

హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాలతో పాటు ఖాళీస్థలంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాయకులు సూచించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన హరితహారంలో ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ ఎంపీపీ నీలంనాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు దండుఇస్తారి,సిద్ధులు, రమేశ్‌యాదవ్, రాంగోపాల్, సతీశ్‌యాదవ్‌లతో పాటు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ డీసీ జగన్‌తో కలిసి మొక్కలు
నాటుతున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో
మొక్కలు నాటుతున్న పారిశుధ్య కార్మికులు

# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ గాంధీ, కార్పొరేటర్ మంజుల రెడ్డి

కొండాపూర్, జూన్ 19 : డ్రైనేజీ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలోని ఎస్‌టీపీ నుంచి శంకర్‌నగర్ నాలా వరకు రూ. కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న పైపులైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మంజులరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా డ్రైనేజీ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దిశగా పనులు కొనసాగుతున్నాయన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. ప్రారంభించిన పనుల్లో వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆకట్టుకున్న బ్రైడల్ ఫ్యాషన్ షో



అలియాబేగ్ అకాడమీ ఆఫ్ మేకప్ విద్యార్థుల కాన్వకేషన్ వేడుకలు వైభవంగా జరిగింది. శంషాబాద్‌లోని సూర్య ఎరీనాలో సోమవారం 2022-23 బ్యాచ్ విద్యార్థులు బ్రైడల్ ఫ్యాషన్ షోతో ఆకట్టుకున్నారు. ఇంటర్నేషనల్ మేకప్ అసోసియేషన్-లండన్ స్కూల్ ఆఫ్ మేకప్ సహకారంతో కాన్వకేషన్ వేడుకలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈవెంట్‌కు ఫ్యాషన్ రంగంలో అనుభవజ్ఞులైన బెరిల్ బెర్నార్డ్ హాజరయ్యారని తెలిపారు.

–సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ):

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కొండాపూర్, జూన్ 19 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి సూచించారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని తారానగర్‌లోని పార్కులో నిర్వహించారు.